నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 15 అక్టోబర్ 2024 | YADADRI BHUVANAGIRI

జంకా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రనాయక్, భూపాల్‌రెడ్డి, పైళ్ల, గాదరి కిశోర్, బీఆర్ఎస్ నేతలు రామకృష్ణారెడ్డి, రాంచందర్ నాయక్

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడికి
మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

పెద్దవూర, అక్టోబర్ 14: మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు జటావత్ రవినాయక్‌ను మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. రవినాయక్ తల్లి జంకా ఇటీవల మృతిచెందగా, సోమవారం వారి ఇంటికి ఎమ్మెల్సీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రామచందర్‌నాయక్‌తో కలిసి వెళ్లారు. జంకా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కేవీ రామారావు, సుందర్‌రెడ్డి, నడ్డి లింగయ్య, రావుల శ్రీను, లక్ష్మణ్‌నాయక్, శ్రీకర్, సురభి రాంబాబు, కిషన్, గోపి, రమావత్ రవి, విష్ణునాయక్, ఫణీంద్రనాయక్, రమేశ్, మల్లికార్జున్ ఉన్నారు.



బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ రమేశ్‌రెడ్డి తదితరులు

సమాజ రుగ్మతల నివారణకు బుద్ధుడి బోధనలే శరణ్యం

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- బుద్ధవనంలో దమ్మ విజయోత్సవాలు

హాలియా/నాగార్జున సాగర్, అక్టోబర్ 14 : సమాజంలో నెలకొన్న రుగ్మతల నివారణకు బుద్ధుడి బోధనలే శరణ్యమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సామ్రాట్ అశోక చక్రవర్తి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బౌద్ధ దమ్మ తీసుకున్న రోజైన అక్టోబర్ 14ను పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ సాగర్ బుద్ధవనంలో దమ్మ విజయ వేడుకను నిర్వహించింది. ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డితో కలిసి మండలి చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బుద్ధ చరిత వనంలోని బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం మండలి చైర్మన్ గుత్తా మాట్లాడుతూ స్వార్థం మితిమీరి అత్యాశ తారాస్థాయికి చేరిన నేటి సమాజంలో బుద్ధుని పంచశీల పాటిస్తే యుద్ధాలకు తావే ఉండదన్నారు. ఎంఎల్‌సీ మంకెన చినకోటిరెడ్డి మాట్లాడుతూ ఇక్ష్వాకుల కాలంలో నాగార్జున కొండలో విరజిల్లిన బౌద్ధాన్ని ప్రస్తావిస్తూ బుద్ధవనం అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా మారుతున్నదని తెలిపారు. టూరిజం కార్పొరేషన్ చైర్మన్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ బుద్ధవనం ఆసియాలోనే అరుదైన బౌద్ధ వారసత్వ థీమ్ పార్కుగా గుర్తింపు పొందుతుందన్నారు. మోక్షానంద బౌద్ధ విహార అధ్యక్షుడు ధర్మ రక్షిత బౌద్ధ దమ్మ విజయాల గురించి వివరించారు. లతా రాజా ఫౌండేషన్ సలహాదారు పీఎస్ఎన్ మూర్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దమ్మ దీక్ష తీసుకున్న నేపథ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, టూరిజం కార్పొరేషన్ ఎండీ, బుద్ధవనం ప్రత్యేకాధికారి ఎన్. ప్రకాశ్‌రెడ్డి, బుద్ధవనం అధికారులు సుధన్‌రెడ్డి, ఈమని శివనాగిరెడ్డి, సూర్యప్రకాశ్‌రావు, శ్యాంసుందర్‌రావు, మ హేంద్ర హిల్స్‌లోని మహాబోధి బుద్ధ విహార, మైసూర్ బైలా కుప్పేలోని మహాబోధి విహార నుం చి వచ్చిన బౌద్ధ భిక్షువులు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఇంగ్లిష్, ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, కంది ఐఐటీ నుంచి వివిధ దేశాల విద్యార్థులు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా ఒగ్గు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణగా నిలిచాయి.

త్రిపురారం మండలం అంజనపల్లి గ్రామంలో నేలకొరిగిన వరి పైరు

పిడుగుపాటుకు మహిళ మృతి

- మరొకరికి గాయాలు

మామిడి రమణ (ఫైల్)

నడిగూడెం/త్రిపురారం, అక్టోబరు 14 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సోమవారం పలు మండలాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. నడిగూడెం మండలంలోని బృందావనపురం గ్రామానికి చెందిన మామిడి రమణ (24), అదే గ్రామానికి చెందిన మామిడి పద్మతో కలిసి నడిగూడెం శివారులోని గట్ట మైసమ్మ ఆలయం వద్ద పత్తి తీసేందుకు వెళ్లగా, ఆ సమీపంలోనే పిడుగు పడింది. చెట్టు కింద అన్నం తింటున్న రమణ అక్కడికక్కడే మృతి చెందగా, పద్మకు తీవ్ర గాయాలు అవడంతో కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. త్రిపురారం మండలంలో ఈదురు గాలితో కూడిన వర్షానికి వరి పైర్లు నేలవాలాయి. అంజనపల్లి, నీలాయగూడెం, త్రిపురారం, కొణతాలపల్లి పంట నష్టం ఎక్కువగా వాటిల్లింది. వరి పైరు కంకి దశలో ఉండడంతో ఈదురుగాలులకు తట్టుకోలేక నేలకు పడిపోతున్నాయి. మూడు రోజులను వర్షాలు పడడుతండడంతో కొన్నిచోట్ల మొలకలు కూడా వస్తున్నాయని రైతులు వాపోయారు.

మోత్కూరులో డిగ్రీ కళాశాలను బంద్ చేసి నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

ప్రైవేట్ కాలేజీలు బంద్

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చే వరకు తెరిచేది లేదంటున్న యాజమాన్యాలు

- బంద్ నోటీసులకు ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ఆందోళన
- ఉమ్మడి జిల్లాలో 76 కళాశాలలు బంద్

రామగిరి, అక్టోబర్ 14 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు ఆందోళన బాట పట్టాయి. తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో ప్రభుత్వానికి, ఎంజీయూ రిజిస్ట్రార్‌కు బంద్ నోటీసు అందించినా స్పందన లేకపోవడంతో సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 76 కాలేజీలను తెరువలేదు. సర్కారు నిర్లక్ష్యంతో కళాశాలలు నిర్వహించలేని పరిస్థితి నెలకొందని పలు యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలో అన్ని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలను బంద్ చేసి రామగిరిలోని నీలగిరి డిగ్రీ, పీజీ కళాశాల వద్దకు ఆయా యాజమాన్యాలు, అధ్యాపక బృందాలు చేరుకున్నాయి. ఫ్లెక్సీలు, ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా టీపీడీపీఎంఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయపోవడంతో కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నిర్వహణ, అధ్యాపకులు, సిబ్బంది వేతనాలకు అప్పులు చేయాల్సి వస్తున్నదని, తెచ్చిన అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి రీయింబర్స్‌మెంట్ విడుదల చేసే వరకు ప్రతి రోజూ నిరసన కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు. తొలి రోజు బంద్‌లో టీపీడీపీఎంఏ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు కె.రామ్మోహన్, డాక్టర్ నర్సింహారెడ్డి, గుండెబోయిన జానయ్యయాదవ్ పాల్గొన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు 76 ఉన్నాయి. వాటిలో ప్రతి సంవత్సరం 16 వేల మంది విద్యార్థులు దోస్త్, సీజీ గేట్ ద్వారా అడ్మిషన్లు తీసుకుని చదువుకుంటున్నారు. వారి నుంచి ఫీజు తీసుకోకుండానే ప్రైవేట్ కాలేజీలు అడ్మిషన్ ఇచ్చి బోధన అందిస్తున్నాయి. ఒక్కో ఏడాదికి రూ.55 కోట్ల చొప్పున బకాయి ఉన్నదని టీపీడీపీఎంఏ తెలిపారు.

డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంపిణీ చేయాలని ధర్నా



ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 14 : మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తాసీల్దార్ మందడి మహేందర్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు కోట రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఇండ్ల పంపిణీ కోసం పేదల నుంచి దరఖాస్తులను స్వీకరించి పక్కన పడేశారన్నారు. పేదలు ఇండ్లు లేక, అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే అర్హులను గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంపిణీ చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మంచాల మధు, లక్ష్మయ్య, జగన్, శివ నాగేశ్వర్ పాల్గొన్నారు.

బైక్ ట్యాంక్ కవర్‌లోని రూ.50వేలు మాయం

మోత్కూరు, అక్టోబర్ 14 : మున్సిపాలిటీలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదుట బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టిన రూ.50 వేలు మాయమైన ఘటన చోటు చేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. మండలంలోని పొడిచేడుకు చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాదారుడు తన ఖాతాలో డబ్బులు జమ చేసేందుకు సోమవారం బ్యాంకుకు వచ్చాడు. బ్యాంకు ఎదుట తన బైక్‌ను నిలిపి బ్యాంకులో రద్దీ ఎలా ఉందో చూసేందుకు లోపలికి వెళ్లాడు. వెంటనే తిరిగి వచ్చి చూసేసరికి బైక్ ట్యాంకు కవర్‌లో పెట్టిన రూ.50వేలు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా ప్రదేశంలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు.

బిర్యానీలో జెర్రి!

బిర్యానిలో వచ్చిన పురుగు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 14 : భువనగిరి పట్టణ పరిధిలోని వరంగల్ – హైదరాబాద్ హైవే మార్గంలో ఉన్న ఓ హోటల్‌లో సోమవారం ఓ వ్యక్తి చికెన్ బిర్యానీ తింటుండగా.. అందులో జెర్రి కనిపించింది. దాంతో సదరు వ్యక్తి ఒక్కసారిగా భయపడి హోటల్ వెయిటర్‌ను పిలిచాడు. అతను జెర్రిని తీసుకెళ్తుండగా.. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వచ్చేదాకా ఇక్కడే ఉంచాలని వినియోగదారుడు గట్టిగా వారించడంతో వెయిటర్ అక్కడే పెట్టాడు. ఈ విషయాన్ని ఎక్కడా చెప్పకుండా వినియోగదారుడికి హోటల్ యాజమాన్యం సర్ది చెప్పి పంపించింది. హోటళ్లలో సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, ఇలా ఉంటే ప్రజల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని పలువురు పేర్కొంటున్నారు.

గాలికుంటుతో ప్రమాదం

- పశువులు మృత్యువాత పడే అవకాశం
- ముందస్తు జాగ్రత్తలే రక్ష
- నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ
- సూర్యాపేట జిల్లాలో 46 బృందాల ఏర్పాటు

నేరేడుచర్ల/సూర్యాపేట అర్బన్, అక్టోబర్ 14 : పశువులకు సోకే ప్రధాన వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. సకాలంలో వ్యాధి లక్షణాలను గురించి నివారణ చర్యలు చేపట్టకపోతే పశువులు, వాటి పాలు దాగిన దూడలు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో గాలికుంటు నివారణ టీకాల పంపిణీకి పశు సంవర్ధక శాఖ సిద్ధమైంది. జిల్లావ్యాప్తంగా 23 మండలాల్లో 1.86 లక్షల పశువులు ఉంటాయని అంచనా వేసి, 46 బృందాలను ఏర్పాటు చేంది. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు టీకాల పంపిణీ కొనసాగనున్నది. జిల్లాలోని 5 పశు వైద్యశాలలు, 41 ప్రాథమిక చికిత్స కేంద్రాలు, 42 గ్రామీణ పశువైద్యశాలతోపాటు అన్ని గ్రామాల్లో ఆవులు, ఎద్దులు, గేదెలకు టీకాలు వేయనున్నారు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

గాలికుంటు వ్యాధి పికోర్నా విరిడే వైరస్ ద్వారా వస్తుంది. పశువులు కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాప్తి చెందుతుంది. పశువులు అలాంటి ఆహారం, నీరు తీసుకోకుండా పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

గుర్తించడం ఇలా..

గాలి కుంటు సోకిన పశువుల ఉష్ణోగ్రత 104 డిగ్రీల నుంచి 106 డిగ్రీల వరకు ఉంటుంది. నోరు, నాలుక, పెదవులు, చిగుళ్లు, కాలి గిట్టల దగ్గర బొబ్బలు వస్తాయి. 24 గంటల తర్వాత అవి పగిలి పుండ్లుగా మారుతాయి. ఈ వ్యాధి సోకిన జీవాలు నోటిలో పుండ్ల నొప్పి కారణంగా మేత తినవు. దాంతో నీరసించిపోతాయి. నోటి నుంచి లాలాజలం కారుతుంటుంది. కాలి గిట్టల్లో ఉన్న పుండ్లు వల్ల సరిగ్గా నడవలేవు. వ్యాధి సోకిన తరువాత పాలు ఇవ్వడం తగ్గుతుంది. లేత వయస్సు గల పశువులకు వ్యాధి సోకితే మరణించే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కొన్ని పశువుల్లో బొబ్బలు పొదుగుపైన ఏర్పడితే పొదుగు వాపునకు దారి తీస్తుంది.

చికిత్స..

పశువుల నోరు, కాలి గిట్టల మధ్య ఏర్పడిన పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావకంతో శుభ్రంగా కడుగాలి. తరువాత బోరోగ్లిజరిన్ పేస్ట్‌ను పుండ్లపై రాయాలి. పెన్సిలిన్ వంటి యాంటిబయోటిక్ మందులను పశువులకు అందించాలి. హోమియోలోనూ ఈ వ్యాధి నివారణకు మందులు ఉన్నాయి.

నివారణ చర్యలే ముఖ్యం

పశువుల్లో గాలి కుంటు వ్యాధి సోకిన తర్వాత జాగ్రత్తలు తీసుకునే కంటే ముందుగానే నివారణ చర్యలు తీసుకోవడం ముఖ్యం. నాలుగు నెలల వయస్సు నిండిన పశువులు, జీవాలకు గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలి. గేదెలు, ఆవులకు 2 మిల్లీలీటర్ల చొప్పున టీకా ఇవ్వాలి. ప్రతి ఆరు నెలకోసారి క్రమం తప్పకుండా టీకాను వేయిస్తే గాలికుంటు వ్యాధి సోకదు. వ్యాధి సోకిన గేదె పాలను దూడలకు తాగించకూడదు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాస్‌రావు, జిల్లా పశువైద్యాధికారి, సూర్యాపేట



విద్యార్థిని గౌరికి చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వైద్య విద్యార్థిని చదువుకు చేయూత

- ఎన్ఆర్ఐ వెంకట్‌గౌడ్ ఆర్థిక సాయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా చెక్కు అందజేత

ఆలేరురూరల్, అక్టోబర్ 14 : ఎంతో కష్టపడి నీట్‌లో ఎంబీబీఎస్ సాధించినా ఫీజు చెల్లించేందుకు స్థోమత లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థినికి జిల్లాకు చెందిన ఎన్ఆర్ఐ చేయూతనందించారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం కాల్వరాల గ్రామానికి చెందిన బొరెల్లి గౌరి నీట్‌లో మంచి ర్యాంకు సాధించింది. కానీ, చదువుకు ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని మీడియా, సోషల్ మీడియా వేదికగా తన ఆవేదనను పంచుకున్నది. విషయం తెలుసుకున్న అమెరికాలో స్థిరపడ్డ మండలంలోని శారాజీపేట గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ దూడల వెంకట్‌గౌడ్ ఆమెకు చదువుకు సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు. సోమవారం తన తండ్రి దూడల రవీందర్‌గౌడ్‌ను హైదరాబాద్‌కు పంపి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతులమీదుగా రూ.లక్షన్నర చెక్కును గౌరి, ఆమె తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌గౌడ్ చొరవను కేటీఆర్ అభినందించారు. గౌరి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కే జెండగే

ప్రజావాణి ఫిర్యాదులపై అలసత్వం వహిస్తే చర్యలు

- కలెక్టర్ హనుమంతు కే జెండగే

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 14 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతు కే జెండగే జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ శాఖకు 6, జిల్లా పంచాయతీ అధికారికి 4, ఉపాధి కల్పన అధికారికి 3, హౌసింగ్ డీఈఈ, మున్సిపల్, అటవీ, పోలీస్, ఆరోగ్య శాఖకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, జడ్పీ సీఈఓ శోభారాణి పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో ఎన్‌హెచ్ 65పై ట్రాఫిక్ జామ్

హైవేపై వాహన బారులు

- కొనసాగుతున్న రద్దీ

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 14 : దసరా సెలవులు సోమవారంతో ముగియడంతో హైదరాబాద్‌కు వాహనాలు బారులు దీరాయి. పండగకు సొంతూళ్లకు వచ్చిన వాళ్లు తిరిగి పట్నం బాట పట్టడంతో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం వాహనాల రద్దీ కొనసాగింది. చౌటుప్పల్, పంతంగి టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ జామ్ అవగా, పోలీసులు క్లియర్ చేశారు.

డీఎస్సీ అభ్యర్థుల పోస్టింగ్‌కు నేడు కౌన్సెలింగ్

భువనగిరి అర్బన్, అక్టోబర్ 14 : డీఎస్సీ–2024లో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల పోస్టింగ్‌కు మంగళవారం పట్టణ పరిధిలోని వెన్నెల కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నియామక ఉత్తర్వులు పొంది డీఈఓ కార్యాలయంలో రిపోర్ట్ చేసిన వారంతా హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను తీసుకురావాలని పేర్కొన్నారు.

మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కౌన్సిలింగ్ ప్రారంభం అవుతుందని, అనంతరం పోస్టింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

అంతర్జాతీయ పోటీల్లో మన పోలీస్ ప్రతిభ

- హెడ్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్‌కు వెండి పతకం



వెండి పతకంతో అనిల్‌కుమార్

యాదగిరిగుట్ట, అక్టోబర్ 14: మలేషియాలోని కౌలాలంపూర్ ఏంఎస్ఎన్ స్టేడియంతో ఇటీవల జరిగిన 36వ మలేషియా మాస్టర్ చాంపియన్‌షిప్ అథ్లెటిక్స్ పోటీల్లో భారతదేశం తరపున జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ అంబోజు అనిల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ పోటీల్లో 400 మీటర్ల రిలే పరుగులో వెండి పతకం సాధించాడు. నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్ కుమార్ శర్మ, సెక్రటరీ రాంపాల్ శర్మ అనిల్‌కుమార్ అభినందించారు. అనిల్‌కుమార్ ప్రస్తుతం భువనగిరి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్నారు.

ఏషియన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థిని

జి మమత

కావలి రుక్మిణి

బీబీనగర్, అక్టోబర్ 14 : మండలంలోని రాఘవాపురం గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని గుగులోతు మమత 4వ ఏషియన్ యూనివర్సిటీ ఉమెన్ సాఫ్ట్‌బాల్ ఏషియన్ కప్ 2024కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరూప తెలిపారు. ఈ నెల 15 నుంచి తైవాన్‌లోని తైచుంగ్ లో జరుగనున్న పోటీల్లో భారతదేశం తరపున మమత పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కళాశాలకు చెందిన మరో విద్యార్థిని కావలి రుక్మిణి ఖేలో ఇండియా సౌత్ జోన్ నేషనల్ ఖో ఖో టోర్నమెంట్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఎంపికైనట్లు తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఈ నెల 15 జరగనున్న పోటీల్లో రుక్మిణి పాల్గొంటుందని చెప్పారు. ఇద్దరు క్రీడాకారిణులను ప్రిన్సిపాల్ సోమవారం అభినందించారు.